Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts




వరంగల్ | సంపుటి 2 | సంచిక 61 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 02.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

హైడ్రా vs గణేశ్ ఉత్సవ సమితి

- హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

- హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం
- తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా
- అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి
- యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ



2

1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

- నేడు తెలంగాణ భవన్‌లో విడుదల చేయనున్న కేటీఆర్
- కాంగ్రెస్ 420 హామీల ఎగవేతలే ఎజెండాగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు
- రోజుకో అంశంపై సర్కార్‌ను నిలదీసేలా కార్యాచరణ
- కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రజాక్షేత్రంలో ప్రచారం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యక్రమాలు

2



కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ..

ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ


రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చలు

మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రధానంగా మంతనాలు

మంత్రివర్గ విస్తరణపై చర్చ..?

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణుగోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.....

2



7.8 శాతం వృద్ధి పేరుతో మోదీ 'పంచ్'..

- రాహుల్ ప్రచారంపై 'జూర్ కీ గూంజ్' సెటైర్!



తొలి త్రైమాసికంలో 7.8 శాతం పెరిగిన జీడీపీ

ఆర్‌బీఐ అంచనాలను అధిగమించిన వృద్ధి

'జూర్ కీ గూంజ్'పై మోదీ సెటైర్

రాహుల్ 'ఛాత్రోంకీ గూంజ్' ప్రచారంపై చర్చ

ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్ ముందుకెళుతోందని మోదీ వ్యాఖ్య

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలకు మించి వృద్ధి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశంలో వినిపిస్తున్న 'జూర్ కీ గూంజ్' (అబద్ధాల ప్రతిధ్వని) అంటూ సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఛాత్రోంకీ గూంజ్' ప్రచారాన్ని ఉద్దేశించినవేనన్న చర్చ మొదలైంది. ఎస్‌సీవో సదస్సు కోసం కిర్గిజిస్తాన్‌లోని బిష్కెక్‌లో ఉన్న మోదీ.. యువతను ఆకట్టుకునేలా ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ తరహా వీడియోను విడుదల చేశారు. '7.8 శాతం వృద్ధి.. బలమైన గణాంకాలు.. మరింత బలమైన విశ్వాసం' అంటూ దానికి క్యాప్షన్ ఇచ్చారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి చెందింది. ఆర్‌బీఐ అంచనాలను కూడా ఈ వృద్ధి అధిగమించింది. ఇరాన్ యుద్ధం, దాని ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపొచ్చన్న అంచనాల మధ్య ఈ వృద్ధి నమోదైంది. ప్రపంచం యుద్ధాలు, సంక్షోభాలతో సతమతమవుతోందని మోదీ అన్నారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. 2020లో కరోనా కాలం నుంచి ఇప్పటివరకు ప్రపంచంలో స్థిరత్వం కనిపించలేదన్నారు. అయినా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు...

2

కేసీఆర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డి వణికిపోతున్నారు - జగదీశ్ రెడ్డి

- రాష్ట్రంలో నీటి ఎద్దడి ఉన్నా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదన్న జగదీశ్ రెడ్డి
- అవినీతి సొమ్మును లెక్కించుకోవడంలో నిమగ్నమయ్యారని విమర్శ
- ప్రభుత్వ వైఫల్యాలపై పోరుబాట ప్రారంభిస్తున్నామని వెల్లడి

నిత్యం నిఘా, హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు వింటేనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి అనుక్షణం భయంతో వణికిపోతున్నారని, ఆ భయం కారణంగానే ప్రతి రోజూ అనుచిత మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తుతున్నా, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ పెద్దలు...



2

ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు

- బండి సంజయ్

- తన నియోజకవర్గానికి కేటాయించిన నిధుల్లో 94.1 శాతానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయన్న సంజయ్
- ఏకపక్ష నివేదికలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్య
- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హితవు



2

కూతురి వ్యాఖ్యల దుమారం

- అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ



2

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు.. తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
- పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్షి , షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్షి , షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.....

2

Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 2

7.8 శాతం వృద్ధి పేరుతో మోదీ 'పంచ్'..

- రాహుల్ ప్రచారంపై 'జూత్ కీ గూంజ్' సెటైర్!

మొదటిపేజీ తరువాయి.. దేశంలో నిరాశలో ఉన్న కొందరు 'జూత్ కీ గూంజ్'ను వ్యాప్తి చేస్తున్నారని మోదీ వ్యాఖ్యానించారు. వాటన్నింటినీ అధిగమించి భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. ఇదే వేగాన్ని కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ యువతను చేరువ చేసుకునేందుకు ఇటీవల 'ఛాత్రోంకీ గూంజ్' ప్రచారాన్ని చేపట్టారు. దీనిపై రాజకీయ వ్యంగ్య గ్రూప్ 'జూత్ కీ గూంజ్' విమర్శలు చేసింది. తాజాగా మోదీ చేసిన వ్యాఖ్యలు అదే ప్రచారాన్ని ఉద్దేశించినవిగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ గాంధీ ప్రచారంలో చేసిన 40 వ్యాఖ్యల్లో 29 అసత్యాలు, 11 తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని భాజపా గతంలో ఆరోపించింది.

హైడ్రా vs గణేశ్ ఉత్సవ సమితి

- హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరు పక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ..

మొదటిపేజీ తరువాయి.. ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు..

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్షి , షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

కేసీఆర్ పేరు వింటేనే రేవంత్ రెడ్డి వణికిపోతున్నారు - జగదీశ్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. పట్టించుకోవడం లేదని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనబెట్టి అవినీతి సొమ్మును లెక్కించుకోవడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ప్రతిరోజూ కేసీఆర్‌ను గుర్తుచేసుకోవడంలో రేవంత్ రెడ్డే ప్రథమ స్థానంలో ఉంటారని ఎద్దేవా చేసిన ఆయన... "కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే ధైర్యం నీకుందా?" అని రేవంత్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రేవంత్ సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నదీ జలాలు తరలిపోతుంటే అడ్డుకోలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు, అవినీతికి నిదర్శనమని మండిపడ్డారు. తనకు రాజకీయంగా జన్మనిచ్చిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సీఎం ద్రోహం చేయడం వల్ల మళ్లీ అక్కడ వలసలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, వ్యవసాయ సంక్షోభంపై రేపు బీఆర్ఎస్ పోరుబాట ప్రారంభించనుందని ప్రకటించారు. ఇందులో భాగంగా మిర్యాలగూడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో భారీ రైతు సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మిర్యాలగూడ రైతు సభను నిర్వహించి తీరుతామని, రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట పట్టనున్నది. అలవికాని హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ వేయనున్నది. బుధవారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చార్జ్‌షీట్‌ను విడుదల చేయనున్నారు. చార్జ్‌షీట్‌తోపాటు 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రశ్ని స్తూ ఈ నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సేన సిద్ధమైంది. చార్జ్‌షీట్‌తో మొదలయ్యే ఈ పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. బుధవారం నుంచి ధర్నాలు, రైతు సదస్సులు, వంటా వార్పులు, యువత ర్యాలీలు, ఆటో ర్యాలీలు, ప్రజావాణి వినతిపత్రాలు.. ఇలా ప్రతిరోజూ ఒకో అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టేలా బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చే సింది. ఈ మేరకు మాజీ మంత్రులు, రాష్ట్ర నేతలు ఎక్కడికక్కడ పార్టీ సన్నాహక సమావేశాల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

- దేవుండ్ల సాక్షిగా ఒట్లు వేసి గ్యారెంటీ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు.. వాటి అమల్లో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. వం ద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారని, కానీ వెయ్యి రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'వెయ్యి రోజులు.. వెయ్యి అబద్ధాలు' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై కాంగ్రెస్ బాకీ కార్డులకు మంగళవారం వేముల పూజలు చేసి విడుదల చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో నిర సనలు ఉధృతం చేస్తామని తెలిపారు.
- బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా కాంగ్రె స్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను వి వరిస్తూ గ్రామాల్లో ఫ్లెక్సీలు వెలుస్తున్నా యి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మం డలం ఉప్లూర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం మాయమై.. విధ్వంస పాలన సాగుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం వనపర్తి బీఆర్ఎస్ భవనంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి మోగించనున్నట్టు తెలిపారు. 6 గ్యారెంటీలు, 420 హామీ లు, 11 డిక్లరేషన్లు అమలు చేసే దాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.
- రేవంత్ సర్కార్ ఒక్క హామీ కూడా అమ లు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ పాలనలో వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగట్టేందుకు బుధవారం నుంచి వారం నిరసనలుంటాయని తెలిపారు.
- హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాసర్ పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎగ్గొట్టిన హామీలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు : బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి.. ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతే కాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

కూతురి వ్యాఖ్యల దుమారం

- అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ చైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నల్గొండ ఘటనపై రగులుతున్న రాజకీయం...

- టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు హౌస్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి.. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై నిన్న జరిగిన దాడితో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈరోజు నల్గొండ బయలుదేరిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు తార్నాకలోని ఆయన నివాసం వద్ద అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల ఆంక్షలను ధిక్కరించి ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆయనను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలోకి తరలించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో



ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తూ... ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. బాధితులను పరామర్శించడానికి వెళుతుంటే అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1000 రోజుల పాలనలో ప్రజలను తీవ్రంగా దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి అతి సమీపంలో ఉందని జోస్యం చెప్పారు. ఈ ఘటనతో అటు నల్గొండలోనూ, ఇటు రాజధాని హైదరాబాద్‌లోనూ ఇరు పార్టీల మధ్య ప్రతిఘటనలు తీవ్రరూపం దాల్చాయి. నల్గొండలోని వర్షిత్ రెడ్డి ఇల్లు, కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా బీజేపీ కౌంటర్ ఎటాక్‌కు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించేందుకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు తీవ్రంగా శ్రమించి అడ్డుకున్నారు. నిరసనలు, అరెస్టులతో రెండు పార్టీల మధ్య ఘర్షణ పూరిత వాతావరణం కొనసాగుతోంది.

Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 3

బుధవారం 02 - 09 - 2026

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

- డివైడర్లపై పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలి: GWMC కమిషనర్ తేజావత్ వెంకన్న



హనుమకొండ, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) పరిధిలో నగర సుందరీకరణ, పరిశుభ్రత పనులకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ తేజావత్ వెంకన్న ఆదేశించారు. నగర ప్రధాన రహదారులు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం ఉదయం అదాలత్ జంక్షన్ నుంచి హరిత హోటల్ వరకు ప్రధాన రహదారి మార్గాన్ని కమిషనర్ పాదయాత్రగా వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రహదారికి ఇరువైపులా ఉన్న పరిస్థితులతో పాటు డివైడర్లలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను దగ్గరుండి పరిశీలించారు. డివైడర్లపై విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. అలాగే డివైడర్లలో ఆహ్లాదకరమైన మొక్కలను నాటడంతో పాటు రహదారి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.నగర ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రధాన రహదారులను పరిశుభ్రంగా, పచ్చదనంతో, సురక్షితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

సీపీఎస్ రద్దు చేయాలి.. పీఆర్సీ ప్రకటించాలి

- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన మంగపేట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది



మంగపేట, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1న నిర్వహించిన పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మంగపేట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యోగులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

భూ సర్వేలో పారపాట్లకు తావివ్వొద్దు

- రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ జిల్లా కోమటిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో సర్వే జరుగుతున్న తీరును, ఇప్పటివరకు పూర్తయిన భూముల వివరాలను రెవెన్యూ, సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివరాల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. రికార్డుల నమోదులో సాంకేతిక లేదా ప్రత్యక్ష పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ యజమానుల నుంచి వచ్చే వినతులు, భూ సరిహద్దు వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి

- పీఆర్సీ అమలు చేయాలి.. డీఏ బకాయిలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి: టీఎన్జీవోస్



ఏటూరునాగారం, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పున రుద్ధరించాల ని టీఎన్జీవోస్ ములుగు జిల్లా పబ్లిసిటీ సెక్రటరీ మహమ్మద్ సాదిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో టీఎన్జీవోస్ ఏటూరునాగారం యూనిట్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మువీన్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీఎన్జీవోస్ ములుగు జిల్లా యూనియన్ అధ్యక్షుడు పోలు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మహమ్మద్ సాదిక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను, పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న “చలో హైదరాబాద్” కార్యక్రమంలో ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహమ్మద్ సాదిక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ ములుగు జిల్లా వెటర్నరీ అధ్యక్షురాలు రజిత, యూనిట్ ట్రెజరర్ విక్రమ్, వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ యూనిట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులకు అండగా లింగాల సర్పంచ్ దంపతులు

- సొంత ఖర్చులతో చీరల పంపిణీ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నిరుపేదలకు అండగా నిలుస్తున్న లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి సరిత రవీందర్ దంపతులు తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీ పరిధిలోని నిరుపేద గొత్తికోయ గిరిజన కుటుంబాలను తమ ఇంటికి ఆహ్వానించి సొంత ఖర్చులతో చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సరిత రవీందర్ దంపతులు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కుటుంబం తమ కుటుంబమేనని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఏ సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు మొగిలిపల్లి సరిత, రవీందర్‌తో పాటు గొత్తికోయ గిరిజన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.1,18,430 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం.. ఆరుగురిపై కేసు



ఏటూరునాగారం,సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): నిషేధిత పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,18,430 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏటూరునాగారం ఎస్సై మహేష్ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..

ఏటూరునాగారం – మంగపేట జాతీయ రహదారిలోని చింతలబోరు సమీపంలోని వ్యవసాయ భూమిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ జి.కృష్ణ (హెచ్‌సీ–156) స్టేషన్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఉప్పు రాజేందర్, కుంభం రాజేష్, మిరియాల నరసింహం, ఎస్.కె. అజ్మత్, మునిగల పూర్ణచందర్, కేశవేని వెంకన్నలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,18,430 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిషేధిత పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మహేష్ హెచ్చరించారు.ఈ దాడిలో పోలీసు సిబ్బంది కె.ధ్రువ, జె.హరీష్, బి.సుధాకర్, పి.సదానందం, డి.చంద్రమోహన్, అశోక్ పాల్గొన్నారు.

మార్చి నాటికి ఆర్‌అండ్‌బీ పనులు పూర్తి చేయాలి

- పనుల వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ వద్దు : కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా,సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి వచ్చే మార్చి నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌బీ శాఖ పనుల పురోగతిపై ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న రహదారులు, భవనాలు, ఇతర ఆర్‌అండ్‌బీ పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. ప్రారంభం కాని పనులు, వివిధ దశల్లో ఉన్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంతో పాటు పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపులను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి మండలానికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని, వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటాయి సర్పంచ్ గట్టి రాములు దశదిన కార్యక్రమానికి మంత్రి సీతక్క

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): కొత్తగూడ మండలం ఓటాయి గ్రామ సర్పంచ్ గట్టి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా గట్టి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి సీతక్క.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గట్టి రాములు కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి అవసరం వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ధైర్యం చెప్పారు. మంత్రి సీతక్క వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భానోత్ రూప్‌సింగ్, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 4

కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 14 డిక్లరేషన్లను విస్మరించారు: బీఆర్ఎస్ నేతలు



ములుగు జిల్లా కేంద్రం, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): కేంద్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 14 డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను నిరసిస్తూ చేపట్టిన ఏడు రోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళలకు ఇచ్చిన హామీ ఏమైంది?మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని వారు ఆరోపించారు. ములుగు నియోజకవర్గంలోని సుమారు 80 వేల మంది మహిళలకు ఈ పథకం కింద రూ.660 కోట్ల మేర బకాయి ఉందని పేర్కొన్నారు. తులం బంగారం హామీని కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉచిత బస్సు పథకం పేరుతో కొన్ని మార్గాల్లో బస్సుల సంఖ్య తగ్గించి, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలికేసీఆర్ హయాంలో రైతుబంధు సకాలంలో అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం హామీని అమలు చేయలేదని విమర్శించారు. రైతుభరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు రూ.12 వేల సాయం వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. అన్ని వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, సన్న రకాల ధాన్యానికి మాత్రమే బోనస్ పరిమితం చేశారని ఆరోపించారు. పోడు భూముల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలికేసీఆర్ హయాంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజన రైతులకు భరోసా కల్పించామని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో పోడు భూముల విషయంలో అధికారుల వేధింపులు పెరిగాయని ఆరోపించారు. ఈ సమస్యపై స్థానిక మంత్రి సీతక్క స్పందించాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలిములుగు ఏరియా ఆసుపత్రి, ఏటూరునాగారం వైద్య సిబ్బంది కొరతపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, బస్ డిపో, కరకట్ట నిర్మాణం, దేవాదుల పంప్‌హౌస్ ద్వారా చెరువులను నింపే ప్రక్రియ వంటి స్థానిక సమస్యలను ప్రభుత్వం, స్థానిక మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా పరిస్థితి దెబ్బతిన్నదని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేరుతో అధిక బిల్లులు వస్తున్నాయని ఆరోపించారు. రూ.5 లక్షల విద్యా భరోసా, యువతకు ఉద్యోగాలు, అమ్మాయిలకు స్కూటీలు వంటి హామీలు కూడా అమలు కాలేదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కక్షసాధింపు చర్యలు, హైడ్రా చర్యలు, భూదందాల వ్యవహారాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని నాయకులు అన్నారు. రాబోయే రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పోరిక గోవింద్‌నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, మాజీ ఎంపీపీ వినయ్‌కుమార్, మల్కా రమేష్, తాడూరి రఘు, గై అశోక్, రమేష్‌రెడ్డి, లింగాల రమణారెడ్డి, నరసింహ నాయక్, కాకులమర్రి ప్రదీప్‌రావు, చెన్న విజయ్, ఎండీ ఖాజా పాషా, పాలెం శ్రీనివాస్, చిన్ని కృష్ణ, కోయిల మహేష్, బాడిశే నాగరమేష్, చిట్టి మల్ల సమ్మయ్య, భూక్య అమర్‌సింగ్, ముడతనపల్లి మోహన్, ముంజల భిక్షపతి, పోరిక విజయ్, ఓదేలు, కోళ్ల వెంకన్న, కర్ర రవీందర్, వేణుగోపాల్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావుతో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగుండం ఏరియా-1లో 124 శాతం బొగ్గు ఉత్పత్తి

- కార్మికుల రక్షణకు కట్టుబడి ఉన్నాం.. పరిశ్రమలకు వేగంగా బొగ్గు రవాణా: జీఎం లలిత్‌కుమార్



పెద్దపల్లి జిల్లా/ రామగుండం, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): రామగుండం ఏరియా-1లో ఆగస్టు నెలలో రికార్డు స్థాయిలో 124 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు సింగరేణి జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆగస్టు నెల ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించారు. ఆగస్టు నెలలో 2,45,200 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 3,04,086 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు జీఎం తెలిపారు. నిర్దేశిత లక్ష్యం కంటే అధికంగా ఉత్పత్తి సాధించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా 2,45,200 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను 2,50,739 టన్నులు రవాణా చేసి 102 శాతం పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్జీ-1 పరిధిలోని వివిధ గనుల్లోనూ గణనీయమైన ఉత్పత్తి నమోదైందని లలిత్‌కుమార్ తెలిపారు. జీడీకే-1,3 బొగ్గు గనుల్లో 64 శాతం, జీడీకే-2, 2ఏ గనిలో 71 శాతం, జీడీకే-1ఏ గనిలో 298 శాతం ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించే దిశగా అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేస్తున్నారని అన్నారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యంబొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల రక్షణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని జీఎం స్పష్టం చేశారు. గనుల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన బొగ్గును సకాలంలో, వేగంగా రవాణా చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు లలిత్‌కుమార్ తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, రెడ్డిమల్ల తిరుపతి, ఆంజనేయులు, జితేందర్‌సింగ్, వేణు, హనుమంతరావు, వీరారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ విమర్శల్లో సంస్కారం పాటించాలి

-ఏ ఒక్కరోజూ హద్దులు దాటి మాట్లాడలేదు: మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి):తాను 15 ఏళ్ల పాటు ప్రజాప్రతినిధిగా, ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ ఏ ఒక్కరోజూ ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి సంస్కారం లేకుండా, హద్దులు దాటి మాట్లాడలేదని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.మంగళవారం హనుమకొండ బాలసముద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై, అధికార పార్టీ నేతల వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యార్థులకు మద్దతుగా, వారి సమస్యలపై పోరాడేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారని తెలిపారు.విద్యార్థుల సమస్యలపై వారి తరఫున నిలబడేందుకు వచ్చిన నాయకుడిపై అధికార పక్ష నేతలు ఇష్టానుసారంగా, చిల్లరగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని వినయ్ భాస్కర్ హితవు పలికారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలకు దిగజారి రాజకీయాలను కలుషితం చేయడం తగదన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతల వైఖరిని, జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. అధికార మదంతో విర్రవీగుతున్న వారికి సరైన సమయంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు.

రైల్వే ప్రాజెక్టులకు భూ సేకరణపై ప్రత్యేక దృష్టి


- సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ,సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి):హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం కోమటిపల్లిలో రైల్వే సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ కోసం చేపడుతున్న సర్వే పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.అలాగే జయగిరి వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో నిర్మించ తలపెట్టిన రోడ్ ఓవర్ బ్రిడ్జి (ROB), రోడ్ అండర్ బ్రిడ్జి (RUB) నిర్మాణాలకు అవసరమైన భూమి సేకరణ కోసం జరుగుతున్న సర్వేను కూడా కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించి, భూ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం భీమారం శివారులోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ స్కూల్ కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని, తదుపరి చర్యలు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. తదుపరి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కూడా, రెవెన్యూ, రైల్వే శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రైల్వే శాఖకు సంబంధించిన భూ సేకరణ అంశాలపై చర్చించి, ప్రాజెక్టులకు అవసరమైన భూమిని సకాలంలో సమకూర్చేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఐఆర్ఎస్ఈ సైలేష్, డీవైఎస్ఓ ప్రశాంత్, జిల్లా మత్స్యశాఖ అధికారి పిల్లి శ్రీపతి, ఆర్‌అండ్‌బీ ఈఈ చరణ్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ వేడుకలకు హాజరైన నాయిని నీలిమారెడ్డి

- పదవీ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి



హనుమకొండ, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని పిస్తా హౌస్ బాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన ఏసీపీ జితేందర్‌రెడ్డి పదవీ విరమణ వేడుకలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏసీపీ జితేందర్‌రెడ్డిని కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని నాయిని నీలిమారెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏసీపీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డి.ఎస్. జగన్



హైదరాబాద్, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):
సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (అడిషనల్ డైరెక్టర్) పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయనకు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు.అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ.. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 5

విద్యార్థినుల భద్రతపై
షీ టీం భరోసా అవగాహన సదస్సు

- గుడ్ టచ్–బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన.. అప్రమత్తంగా ఉండాలని సూచన



భూపాలపల్లి, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి):భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గోరుకొత్తపల్లి మండలం జగ్గయ్యపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు షీ టీం–భరోసా సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్నకుమారి విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు, బాలికల భద్రత, సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి భద్రతా సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అనుచితంగా లేదా అసభ్యంగా ప్రవర్తిస్తే ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని షీ టీం ఎస్సై స్వప్నకుమారి ఆకాంక్షించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- సీపీఎస్ రద్దు చేయాలి.. పెండింగ్ డీఏలు, బకాయి బిల్లులు విడుదల చేయాలి: ఉద్యోగుల జేఏసీ



వరంగల్, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే పునరుద్ధరించాలని ఉద్యోగుల జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్, కన్వీనర్ ఫణికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ కలెక్టరేట్ వద్ద జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నాలుగో తరగతి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుంచి నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట సీపీఎస్ విధానం శాపంగా మారిందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడుతోందని, పదవీ విరమణ అనంతరం ఆశించిన స్థాయిలో పెన్షన్ అందక ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని కోరారు.అలాగే రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రభుత్వం బకాయి పడిన బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.జేఏసీ జిల్లా కన్వీనర్ ఫణికుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, టీజీవో కార్యదర్శి రాజేష్‌రెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, యూటీఎఫ్ నాయకులు తాటికాయల కుమార్, సృజన్ ప్రసాద్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, టీఎన్జీవోస్ సిటీ అధ్యక్షుడు శంకేసి రాజేష్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భానుప్రసాద్, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు యుగేందర్, రిటైర్డ్ పెన్షనర్స్ అధ్యక్షుడు సాంబయ్య, రిటైర్డ్ మార్కెట్ ఉద్యోగుల అధ్యక్షుడు నాగపురి సారయ్య, ఆల పెన్షన్ సంఘ నాయకులు జక్కం దామోదర్, పాకాల చంద్రశేఖర్, టీఎన్జీవో జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, వర్ధన్నపేట యూనిట్ అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకుడు నిజాముద్దీన్, సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు ఉదయ్, పవిత్ర, విమల, రాజ్‌కుమార్, అశోక్, గణేష్, చిరంజీవి, సుమన్, జిత్ర, నాగేశ్వరరావు, గంగాధర్, మధుసూదన్, రమేష్, సందీప్, సత్యనారాయణ, యాదగిరితో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, జిల్లా శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక
- అధ్యక్షుడిగా పొనుగంటి రవీందర్ ఏకగ్రీవ ఎన్నిక



ములుగు జిల్లా/ మల్లంపల్లి, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు మల్లంపల్లి మండలంలోని మల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాకిటి రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, డాక్టర్స్ సెల్ వింగ్ చైర్మన్ ఆనందపు రవిబాబు, డీసీసీ కార్యవర్గ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిట్టిరెడ్డి రామిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కాగితోజు దేవేంద్రచారి, మల్లంపల్లి యూత్ టౌన్ ప్రెసిడెంట్ ఎడ్ల అనిల్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లపల్లి సాంబయ్యతో పాటు చందరాము, రాము, జోషి, జింక వేణు, కూచిన సురేష్ తదితరులు హాజరయ్యారు. మల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పొనుగంటి రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఐత బద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కావటి కుమార్, సహాయ కార్యదర్శిగా గుండ రాజు, కోశాధికారిగా కూచన రమేష్ ఎన్నికయ్యారు.గ్రామ కమిటీ సభ్యులుగా గూడెపు కరుణాకర్, మాచర్ల చంద్రమౌళి, గూడపు శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపల్లి ఐలయ్య, పరికిపండ్ల సదానందం, కొంగ రమేష్, గుర్రాల ప్రశాంత్, భాషబోయిన సురేష్ తదితరులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన గ్రామ కమిటీ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మల్లంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సాధించే దిశగా కమిటీ సభ్యులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై సమరభేరి

- బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలి

- మండల అధ్యక్షుడు దండగల మల్లయ్య





ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజా క్షేత్రంలో పోరాటానికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ తాడ్వాయి మండల అధ్యక్షుడు దండగల మల్లయ్య పిలుపునిచ్చారు. ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు, ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సూచనలతో మంగళవారం తాడ్వాయి మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ ప్రచారం చేసుకోవడం తప్ప ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా పాలన సాగడం లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వారం రోజులపాటు నిర్వహించనున్న సమరభేరి నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

కాటాపురం సర్పంచ్, సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. మహిళలకు తులం బంగారం, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా, ఆడపిల్లలకు స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గోదావరి జలాలను దేవాదుల పంప్‌హౌస్ ద్వారా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ హామీని ఎంతవరకు అమలు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ వంటి పేదలకు ఉపయోగపడే పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పోడు భూములకు గతంలో పట్టాలు అందించినప్పటికీ, ప్రస్తుతం భూ సర్వే పేరుతో రైతుల్లో ఆందోళన నెలకొంటోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి యాదిరెడ్డి, తాడ్వాయి సర్పంచ్ గంట ప్రవళిక, గున్న విజయచంద్రం, కొమరం శైలజ, నూశెట్టి రమేష్, ఉప సర్పంచ్ దుర్గం నవీన్, కొండూరు నరేష్, ఆలయం ఇంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు భక్తి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చేయడం బాబురావు, సిద్ధబోయిన వసంతరావు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- కేక్ కటింగ్, మహా అన్నదానంతో సందడిగా పరకాల



పరకాల, సెప్టెంబర్01(నిత్యం నిఘా ప్రతినిధి): పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట కేక్ కటింగ్‌తో పాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్ కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరకాల పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం ప్రజాసేవలో కొనసాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య విద్యాసాగర్, కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, సుదమల్ల రమేష్, అల్లె దశరథం, గూడెల్లి సదన్న, నల్లెల్ల కుమార్, పాలకుర్తి శ్రీనివాస్, బొచ్చు మాధవిలత, నాయకులు పసుల రమేష్, బొచ్చు సాల్మన్, గొడుగు నాగరాజు పాల్గొన్నారు.జిల్లా కమిటీ సభ్యులు ఎండి జాఫర్ రిజ్వి, పాడి కల్పనా దేవి, కొక్కిరాల స్వాతి, పసుల విజయ, సమన్వయ కమిటీ సభ్యులు ఎండీ రంజాన్, చందుపట్ల రాఘవరెడ్డి, మడికొండ సంపత్, పంచగిరి జయమ్మ, లక్కం వసంతతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 6

విద్యార్థులు ఫుల్.. మౌలిక వసతులు నిల్!

- వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతుల కొరత.. ఇబ్బందుల్లో విద్యార్థులు

వర్ధన్నపేట, సెప్టెంబర్01(నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు మాత్రం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు ఫుల్‌గా ఉన్నా.. సౌకర్యాలు మాత్రం నిల్‌గా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కళాశాలలో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో మరింత మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సౌకర్యవంతమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొంటున్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించాలి

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న వసతులు విద్యార్థుల అవసరాలకు సరిపోకపోవడంతో తరగతుల నిర్వహణతో పాటు రోజువారీ కళాశాల కార్యకలాపాల్లోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పందించాల్సిన అధికారులు

వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కళాశాలను పరిశీలించి అవసరమైన వసతులపై సమగ్రంగా అంచనా వేసి, నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



వర్ధన్నపేటలో 100 పడకల ఆస్పత్రికి

మోక్షం ఎప్పుడు

- 30 పడకల ఆస్పత్రికే అరకొర వసతులు.. భూమిపూజతోనే సరిపెట్టారా?

వర్ధన్నపేట, సెప్టెంబర్01(నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నిర్మాణానికి భూమిపూజ జరిగి నెలలు గడుస్తున్నా పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంతో ప్రజల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వర్ధన్నపేటలోని ఏరియా ఆస్పత్రి 30 పడకల సామర్థ్యంతోనే కొనసాగుతోంది. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయి మౌలిక వసతులు లేకపోవడంతో వైద్య సేవలపై ఒత్తిడి పెరుగుతోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. వీరిన్ తెలిపారు. అవసరమైన వసతులు, సౌకర్యాలు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

★ రూ.28 కోట్లతో ప్రతిపాదన

100 పడకల ఆధునిక ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన, భూకేటాయింపు, భూమిపూజ వంటి ప్రక్రియలు పూర్తయ్యాయి. సుమారు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు గతంలో అధికారులు వెల్లడించారు. అయితే నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ప్రారంభం కాకపోవడంతో ఆస్పత్రి ఎప్పటికి అందుబాటులోకి వస్తుందనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

★ పలు మండలాల ప్రజలకు ప్రయోజనం

100 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వర్ధన్నపేటతో పాటు పర్వతగిరి, ఐనవోలు తదితర మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అత్యవసర వైద్యం, ప్రసూతి సేవలు, ఇతర ప్రత్యేక వైద్య సేవల కోసం వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆస్పత్రికే పూర్తిస్థాయి వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, ప్రతిపాదిత 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



★ భూమిపూజతోనే సరిపెట్టారా?

"భూమిపూజ జరిగి నెలలు గడిచాయి.. ఇక నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?" అని వర్ధన్నపేట ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మాణ పనులకు అడ్డంకులను తొలగించి, 100 పడకల ఆస్పత్రిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

సంగెంలో ఘనంగా ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలు

- బాణసంచా కాల్చి సంబరాలు.. కేక్ కటింగ్, అన్నదానంతో సందడిగా వేడుకలు

వరంగల్ / సంగెం, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):
ప్రజలే కుటుంబంగా.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను సంగెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇండ్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి అరటిపండ్లు, కేక్ పంపిణీ చేయడంతో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగెం ప్రధాన కూడలిలో బాణసంచా కాల్చి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. జై కాంగ్రెస్ అంటూ కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాయకత్వంపై తమకున్న అభిమానాన్ని, విశ్వాసాన్ని పార్టీ శ్రేణులు చాటుకున్నారు.

★ పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందకట్ల నరహరి, జిల్లా నాయకుడు కొట్టం సంపత్, మండల మాజీ అధ్యక్షుడు చోల్లేటి మాధవరెడ్డి, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు, పరకాల అధికార ప్రతినిధి జనగం రమేష్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్పల్లి రమేష్, మడత కేశవులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ వేల్పుల కుమారస్వామి, మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.





వై ఆకారపు బ్రిడ్జిపై గుంతలు.. ప్రమాదాలకు ఆహ్వానం

- తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.. - పాదచారులకు మెట్ల దారి నిర్మించాలి
- ఆర్ఓబీ పరిరక్షణ సమితి కన్వీనర్ మరుపల్ల రవి



వరంగల్, సెప్టెంబర్ 01(నిత్యం నిఘా ప్రతినిధి): రైల్వే గేట్ వై ఆకారపు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కాలినడకన వెళ్లే ప్రజల కోసం రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా మెట్ల దారిని ప్రభుత్వం తక్షణమే నిర్మించాలని ఆర్ఓబీ పరిరక్షణ సమితి కన్వీనర్, 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు. మంగళవారం వై ఆకారపు బ్రిడ్జిపై పలు చోట్ల గుంతలు ఏర్పడి ఇనుప చువ్వలు బయటకు తేలడంతో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ మరుపల్ల రవి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గుంతలు ఏర్పడిన, ఇనుప చువ్వలు బయటకు వచ్చిన ప్రాంతాల్లో పూలు చల్లి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా నిర్మించిన వై ఆకారపు బ్రిడ్జి వర్షాల ప్రభావంతో దెబ్బతిని పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇనుప చువ్వలు బయటకు తేలడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గుంతలు ఏర్పడి చాలా కాలం అవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.వై ఆకారపు బ్రిడ్జిపై నుంచి పాదచారులు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు కొన్ని కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా మెట్ల దారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు వినతిపత్రాలు అందజేసి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై గుంతలను శాశ్వతంగా తొలగించేలా పక్కా ప్రణాళికతో మరమ్మతులు చేపట్టాలని, పాదచారుల కోసం మెట్ల దారిని నిర్మించాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని మరుపల్ల రవి హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వనం కుమార్, మరుపల్ల గౌతమ్, పోలేపాక రాజన్‌బాబు, బొల్లం సంజీవ్, కళ్యాణపు వెంకటేశ్వర్లు, గోనె మధు, గడ్డం రమేష్, కుండే సదానందం, కందగట్ల వినయ్, యాకూబ్ పాషా, దేవర శివ, దేవర రాజు, ఎం.ఏ. జనార్దన్, గొడిశాల మహేష్, ఆకుతోట రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా కథనంతో కదిలిన అధికారులు

డివైడర్‌పై ముళ్ల పొదలు తొలగింపు..

వాహనదారులకు ఊరట



వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి డివైడర్‌పై ప్రమాదకరంగా పెరిగిన ముళ్ల పొదలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదం తప్పినట్లయింది. డివైడర్‌పై ముళ్ల పొదలు విపరీతంగా పెరిగి వాహనదారులకు ప్రమాదకరంగా మారిన విషయాన్ని 'నిత్యం నిఘా' తన కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి సంబంధిత అధికారులను ఆదేశించడంతో సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి ముళ్ల పొదలను తొలగించారు. ప్రధాన రహదారిపై నెలకొన్న సమస్యను గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కరించిన మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న 'నిత్యం నిఘా'ను స్థానికులు అభినందించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పరిష్కారం లభించే వరకు వాటిని ఫాలోఅప్ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.



Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 7

బాలికలు హక్కులు, ఆత్మరక్షణపై అవగాహన పెంచుకోవాలి

- కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన, స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమం





ములుగు జిల్లా / వాజేడు, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి) : బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను అలవర్చుకోవాలని నాగార్జున్ సూచించారు. మంగళవారం వాజేడు మండలంలోని కస్తూర్బా బాలికల హాస్టల్‌లో బాలికల హక్కుల పరిరక్షణ, అవగాహన, స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమాన్ని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగార్జున్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల హక్కులను పరిరక్షించడం, వారికి తమ హక్కులపై అవగాహన కల్పించడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, స్వీయ రక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమన్నారు. బాలల హక్కులు, విద్యా హక్కు, రక్షణ హక్కు, సమానత్వం, బాల్య వివాహాల నివారణ, సురక్షితమైన వాతావరణం తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నమ్మకమైన పెద్దలు, సంబంధిత సహాయ వ్యవస్థలను సంప్రదించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు.

★ బాలికలకు యోగా, కరాటే శిక్షణ

ప్రమాదకర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునేలా బాలికలకు ప్రాథమిక స్వీయ రక్షణ శిక్షణ అందించారు. కరాటే బ్లాక్‌బెల్ట్ నల్లబోయిన సరేశ్వరరావు బాలికలకు కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కరాటే ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పీటీ కే. శైలజ బాలికలకు యోగా శిక్షణ అందించారు. యోగా చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా, చురుకుగా ఉండటంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపడతాయని, ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత పెరుగుతాయని వివరించారు.

★ పరస్పర సహకారంతో ముందుకు సాగాలి

'కేర్ అండ్ షేర్' భావన ద్వారా బాలికలు ఒకరినొకరు గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు సహాయం చేసుకోవడం, సమస్యలను పరస్పరం పంచుకోవడం, ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం నేర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. బాలికల భద్రత, గౌరవం, హక్కులు, భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాలికలు భయంలేకుండా, ఆత్మవిశ్వాసంతో సురక్షితమైన వాతావరణంలో ఎదగడానికి ఇలాంటి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల కోఆర్డినేటర్ గొంది కామేశ్వరరావు, వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి. హనుమంత్, యానిమేటర్లు స్వరూప, రమాదేవి, సీహెచ్. భాస్కర్, కే. ప్రసాద్, దీపిక, కస్తూర్బా పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

- నకిలీ నంబర్ ప్లేట్లు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు: ఎస్సై సందీప్‌కుమార్



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):మంథని పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో పోలీసులు మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా వాహనాలను ఆపి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్‌కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లు, స్పష్టంగా కనిపించని నంబర్లు, హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.★ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవుతనిఖీల్లో వాహన దారుల డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. మైనర్లతో వాహనాలు నడిపించడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను కూడా పరిశీలించి, వాటిని చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ వాహన తనిఖీల్లో ఏఎస్సై మల్లయ్యగౌడ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్‌రావు, కానిస్టేబుళ్లు శివ, అనిల్, నితిన్ పాల్గొన్నారు.

వాస్తవ నిర్ధారణే జర్నలిజానికి తొలిమెట్టు



- **కలం బలమైనది-భాధ్యతో ఉపయోగించాలి**
- **వార్తకంటే వాస్తవమే ముఖ్యం**
- **సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రతి సమాచారాన్ని నమ్మొద్దు: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత**

వరంగల్, సెప్టెంబర్01 (నిత్యం నిఘా ప్రతినిధి): జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వాస్తవాలను పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రజల ముందుకు తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. "వార్త కంటే వాస్తవం ముఖ్యం.. సంచలనం కంటే ప్రజా ప్రయోజనం ముఖ్యం" అని ఆమె అన్నారు. మంగళవారం తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ (టీడీఎంయూ) అధికారిక లోగోను పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జర్నలిస్టు చేతిలోని కలం సమాజంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో నిర్ధారణ లేని సమాచారం ప్రచురిస్తే వ్యక్తుల గౌరవం, ప్రతిష్ఠకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఏదైనా వార్తను ప్రచురించే ముందు సంబంధిత అంశానికి సంబంధించిన వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సమాచారం సంచలనాత్మకంగా ఉందనే కారణంతో వెంటనే వార్తగా ప్రచురించకూడదని అన్నారు.

★ ప్రజా ప్రయోజనమే జర్నలిజం లక్ష్యం

సోషల్ మీడియా విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ఏ సమాచారం అయినా క్షణాల్లో వైరల్ అవుతోందని కమిషనర్ శ్వేత అన్నారు. అయితే వైరల్ అవుతున్న ప్రతి సమాచారం వాస్తవం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా వార్తలుగా ప్రచురించవద్దని సూచించారు. వైరల్ కావడం వేరు.. వాస్తవం కావడం వేరని స్పష్టం చేశారు. ఎక్కువ వ్యూస్, క్లిక్స్ కోసం సంచలనాత్మక వార్తలకు ప్రాధాన్యం ఇవ్వడం కంటే ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడమే జర్నలిజం లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితుల గళాన్ని వినిపించడం, అవినీతి, అక్రమాలను ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీసులు, ప్రభుత్వ శాఖలు లేదా సంబంధిత అధికారుల నుంచి అధికారిక సమాచారం తీసుకున్న తర్వాతే విషయాలను నిర్ధారించుకోవాలని తెలిపారు. వ్యక్తిగత జీవితం, బాధితులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వార్తల విషయంలో మరింత సంయమనం పాటించాలని సూచించారు. బాధితుల కష్టాలను సంచలనంగా మార్చకుండా, వారి సమస్యలను సమాజం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా జర్నలిజం ఉండాలని అన్నారు.

★ టీడీఎంయూ లోగో ఆవిష్కరణ

ఈ కార్యక్రమంలో తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు, కోశాధికారి పల్లె వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్, జాయింట్ సెక్రటరీ బూర నగేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ఈసీ మెంబర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై సర్పంచ్ వివరణ

- **అసత్య ఆరోపణలను ఖండించిన వాసం రాజబాబు**
- **సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టానని వెల్లడి**

ములుగు జిల్లా / వాజేడు, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో చెరుకూరు గ్రామ పంచాయతీపై అందిన ఫిర్యాదుపై ఆ గ్రామ సర్పంచ్ వాసం రాజబాబు వివరణ ఇచ్చారు. తనపై కొందరు చేస్తున్న ఆరోపణలు వాస్తవ విరుద్ధమని ఖండిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నిధుల కొరత ఉన్నప్పటికీ గ్రామ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నప్పటికీ, గ్రామంలో అవసరమైన పలు అభివృద్ధి పనులను సొంత ఖర్చులతో చేపట్టి పూర్తి చేయించానని పేర్కొన్నారు. గత పాలకవర్గం హయాంలో మూలనపడిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను మరమ్మతులు చేయించి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రతిరోజూ పారిశుధ్య సిబ్బందితో చెత్త సేకరణ చేపడుతూ, గ్రామంలో సున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నామని వివరించారు. ముత్యాలమ్మ గుడి వద్ద పగిలిన గేట్ వాల్వ్ స్థానంలో వరంగల్ నుంచి నాణ్యమైన వాల్వ్‌ను తెప్పించి బిగించామని చెప్పారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను వారం రోజుల్లో తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్తంభాలకు తూరలు వేయడానికి ఆగస్టు 31న పంచాయతీ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో ఫాగింగ్ కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి, పారిశుధ్య పనులకు సంబంధించిన బిల్లులు, రసీదులు భద్రంగా ఉన్నాయని సర్పంచ్ తెలిపారు. ఎస్ఎఫ్‌సీ నిధులు ప్రభుత్వ ఆంక్షల కారణంగా ఆలస్యంగా విడుదలవుతున్నాయని అన్నారు. కొన్ని వీధి దీపాలు సాంకేతిక లోపాల కారణంగా వెలగకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు తనపై కుట్రపూరితంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని వాసం రాజబాబు ఆరోపించారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న తనపై చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.



Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఉయిక శిరీషకు న్యాయం చేయాలి

- దానవాయిపేటలో మిన్నంటిన నిరసన.. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన గ్రామస్తులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చర్ల, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):హైదరాబాద్ తుక్కుగూడలో అత్యాచారానికి గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీష మృతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండలం దానవాయిపేట గ్రామంలో గ్రామస్తులు భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో యువత, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రధాన రహదారి గుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం శిరీష చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇర్ప సంఘమిత్ర, పెసా మొబిలైజర్ నూపా రమేష్ మాట్లాడుతూ శిరీష మృతి ఘటనలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సైనావుల్లాపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి తక్షణ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక యువత మాట్లాడుతూ ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉప సర్పంచ్ కాపుల కృష్ణ అర్జునరావు, గ్రామ పెద్ద దానవాయిపేట రుంజ రాజా, పెసా మొబిలైజర్ నూపా రమేష్‌తో పాటు ఆదివాసీ యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం ఉద్యోగుల పోరుబాట

- సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు అంటూ వర్ధన్నపేటలో నినాదాలు





వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వర్ధన్నపేటలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయాల్లో ఉద్యోగులు “సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు” అంటూ నినాదాలు చేశారు. పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.

★ ఓపీఎస్ పునరుద్ధరించాలి

సీపీఎస్ విధానంలో పదవీ విరమణ అనంతరం తమ ఆర్థిక భద్రతపై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంటోందని ఉద్యోగులు తెలిపారు. ప్రభుత్వ సేవలో ఎన్నో సంవత్సరాలు పనిచేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి న్యాయం చేయాలని కోరారు. నిరసన సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉద్యోగుల నినాదాలు మార్మోగాయి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసే దిశగా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు.

చెత్తతో కంపుకొడుతున్న ఇల్లంద

- **స్వచ్ఛ భారత్ ట్రాక్టర్ నిలిచిపోవడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం**
- **కొన్ని వార్డుల్లో మూడు రోజులకోసారి.. మరికొన్ని చోట్ల 15 రోజులుగా చెత్త సేకరణకు బ్రేక్**





వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 1 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణకు వినియోగిస్తున్న ట్రాక్టర్ డీజిల్ కొరత కారణంగా నిలిచిపోవడంతో గ్రామంలో చెత్త సేకరణకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఇళ్ల వద్ద, వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామంలోని కొన్ని వార్డుల్లో మూడు రోజులకోసారి చెత్త సేకరణ జరుగుతుండగా, మరికొన్ని వార్డుల్లో 15 రోజులు గడిచినా చెత్తను తరలించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెత్త సేకరణ కోసం సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ చెత్తను సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన ట్రాక్టర్ డీజిల్ లేక నిలిచిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

★ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

గ్రామంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు, చెత్త సేకరణ నిరంతరాయంగా జరిగేలా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సర్పంచ్ వివరణ, ఈ విషయంపై సర్పంచ్ బేతి సాంబయ్యను వివరణ కోరగా, ఇటీవల తనపై వచ్చిన ఆరోపణలపై విచారణకు వచ్చిన అధికారులు సంబంధిత రికార్డులను తీసుకెళ్లారని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ఎలా ముందుకు వెళ్లాలనే విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ అన్నారు. గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

★ మార్పు కోసం ఎదురుచూపులు

నూతన పాలకవర్గంపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఓటు వేసిన గ్రామస్తులు గ్రామంలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు. కనీసం పరిశుభ్రత వంటి ప్రాథమిక సమస్యలకైనా తక్షణ పరిష్కారం చూపి ఇల్లంద గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

1000 రోజుల ప్రజా పాలనలో తెలంగాణ అభివృద్ధి పథంలో

-సంక్షేమం, సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: చర్లలో నాయకులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చర్ల, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టీపీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు విజయనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గత 1000 రోజుల్లో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే లక్ష్యంగా పాలన సాగించిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదలు, మహిళలు, రైతులు, యువతకు ప్రయోజనం చేకూర్చే పలు కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు.

★ సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రయోజనం

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ జీరో బిల్లులు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా పథకాల ద్వారా పేదలకు పక్కా ఇళ్లు, రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని నాయకులు తెలిపారు. ఆరోగ్య రంగంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేశామని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. పాల్గొన్న నాయకులు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లంకరాజు, కొసరాజా రాజ, పిలక వెంకటరమణరెడ్డి, నూపా కృష్ణ, పాలం నవీన్, మేడబట్టిన వాసు, చీమకుర్తి సాయి చరణ్, చింతురి రజనీకాంత్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కట్టా అమ్మాజీ, స్వరూప, గిరిజ, సరోజిని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు

- చర్లలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల నిరసన దీక్షలు ప్రారంభం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చర్ల, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న అకృత్యాలు, అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త సొందే వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చర్ల మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల నిరసన దీక్షలు ప్రారంభించారు. దీక్షల ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన ఆదివాసీ యువతి ఉయిక శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ నాయకులు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.★ ఏజెన్సీ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి అనంతరం సొందే వీరయ్య మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా రెండు దశాబ్దాలుగా సాగిన ఉద్యమాల ఫలితంగానే ఎంతోమంది ఆదివాసీ నిరుద్యోగులు జీవో నంబర్ 3 ద్వారా ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. జీవో నంబర్ 3కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో 1998 నుంచి 2018 వరకు కొనసాగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత హక్కుల పరిరక్షణ కోసం యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనేతరుల జోక్యం, కుట్రల కారణంగా ఏజెన్సీ చట్టాలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కులు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు ముమ్మినేని అరవింద్, ఎమ్మార్పీఎస్ నాయకులు సీహెచ్. రామ్మూర్తి తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొంది లీలాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరప అంజిబాబు, బీరబోయిన అరుణ, మండల అధ్యక్షుడు కాయం శ్రీనివాసరావు, నాయకులు పాయం సన్యాసి, సున్నం అడ్వాన్స్, యాలం నరసింహారావు, సీనియర్ నాయకులు బీరబోయిన నాగయ్య, శ్యామల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543
Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 02.09.26_Layout 1 9/2/2026 6:50 AM Page 9

ఇల్లందలో టీ-ఫైబర్ కేబుల్‌కు కోత

- మూడు మండలాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం
- అండర్‌గ్రౌండ్ పనుల్లో కేబుల్ తెగిపోయినట్లు సమాచారం.. మరమ్మతులకు అధికారుల చర్యలు



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):
వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో టీ–ఫైబర్ కేబుల్ తెగిపోవడంతో వర్ధన్నపేట, సంగెం, గీసుగొండ మండలాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇల్లందలోని కుమ్మరిగూడెం తండాకు వెళ్లే దారి, పాత సినిమా థియేటర్ సమీపంలో ఎయిర్‌టెల్ సంస్థ ఆధ్వర్యంలో అండర్‌గ్రౌండ్ ఫైబర్ కేబుల్ పనులు చేపడుతుండగా టీ–ఫైబర్ కేబుల్ తెగిపోయినట్లు సమాచారం. సేవలకు అంతరాయం ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సిబ్బందిని ఇల్లందకు పంపించి కేబుల్‌ను మరమ్మతు చేసి సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ కార్యకలాపాలు, ప్రజలకు అందాల్సిన డిజిటల్ సేవలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

★ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

జాతీయ రహదారి 563 సమీపంలో అండర్‌గ్రౌండ్ ఫైబర్ పనులు చేపట్టే సమయంలో ఇప్పటికే ఉన్న ప్రభుత్వ కేబుళ్లను గుర్తించకుండా తవ్వకాలు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సంస్థ నిర్లక్ష్యంపై అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే రోడ్డుపై తవ్విన గుంతలను వెంటనే పూడ్చి, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేవంత్ ప్రభుత్వానికి కేసీఆర్ భయం పట్టుకుంది

- ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారు



హనుమకొండ, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భయం పట్టుకుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో వాటిని అమలు చేస్తామని చెప్పి, దాదాపు 1000 రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ధర్మారెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో మహిళలు, యువత, నిరుద్యోగులు, రైతులను మోసం చేశారని విమర్శించారు.

★ రైతు సంక్షేమాన్ని విస్మరించారు

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బీమా పథకాన్ని కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ధర్మారెడ్డి ఆరోపించారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన రైతు బీమా ప్రీమియం రెన్యువల్ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గతంలో రైతులకు సకాలంలో సాగునీరు అందించామని, ప్రస్తుత ప్రభుత్వం నీటిని అందించకుండా పంటలను ఎండబెడుతోందని ఆరోపించారు. చెరువులు, కాలువల్లో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. యూరియా సరఫరాలోనూ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. యూరియా కోసం రైతులు ఒక మండలం నుంచి మరో మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

★ పథకాలపై కుట్ర చేస్తున్నారని ఆరోపణ

కళ్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదని విమర్శించారు.

★ పరకాల అభివృద్ధిపై విమర్శలు

పరకాల నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన, శంకుస్థాపన చేసిన పనులనే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభిస్తోందని ధర్మారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం అసహనంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశంతో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువత సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ధర్మారెడ్డి అన్నారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌తో పాటు బీఆర్ఎస్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హంటర్ రోడ్డులో ట్రాఫిక్ మార్పులు

- న్యూ సైన్స్ కాలేజీ సమీపంలోని మీడియన్ కటింగ్ తాత్కాలికంగా మూసివేత
- ఈ నెల 4 నుంచి ప్రయోగాత్మకంగా అమలు.. వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల సూచన



హనుమకొండ, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి):
హనుమకొండ పట్టణంలోని హంటర్ రోడ్డులో అదాల జంక్షన్ నుంచి నీలిమ జంక్షన్ వరకు ట్రాఫిక్ నిర్వహణలో మార్పులు చేయనున్నారు. ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలలు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. విద్యార్థుల సురక్షిత ప్రయాణంతో పాటు తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు.

★ 4 నుంచి మీడియన్ కటింగ్ మూసివేత

పరిశీలన అనంతరం ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం కోసం న్యూ సైన్స్ కాలేజీకి కొంత దూరంలో ఉన్న మీడియన్ కటింగ్‌ను సెప్టెంబర్ 4 నుంచి తాత్కాలికంగా, ప్రయోగాత్మక ప్రాతిపదికన మూసివేయాలని నిర్ణయించారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ మార్పును గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ కోరారు.

రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్

బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనం

- మేము భయపడము.. డరో మత్ అంటూ మహిళా కాంగ్రెస్ నిరసన
- ఎఫ్ఐఆర్ ఉపసంహరించాలి.. హల్ద్వానీ ఘటనపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి: ఎర్రబెల్లి స్వర్ణ





హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నిత్యం నిఘా ప్రతినిధి):
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు నిదర్శనమని ఆమె విమర్శించారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాహుల్‌గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఖండిస్తూ, ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో గాంధీభవన్ ఎదుట మహిళా కాంగ్రెస్ నాయకులు శాంతియుతంగా నిరసన చేపట్టారు.

★ దళితుడి కూర్చున్న ప్రదేశాన్ని శుద్ధి చేయడమా?

ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హల్ద్వానీలో బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం ఆయన కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గంగాజలంతో శుద్ధి చేశారని ఆరోపించారు. ఒక దళితుడు కూర్చున్న ప్రదేశాన్ని శుద్ధి చేయడం దళితులను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటన ఖర్గేను అవమానించడం మాత్రమే కాదని, రాజ్యాంగ విలువలను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనని విమర్శించారు. ఈ ఘటనను రాహుల్‌గాంధీ ప్రశ్నించి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని, అయితే నిందితులపై చర్యలు తీసుకోకుండా రాహుల్‌గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కేసులా, కులగణన, మహిళా రిజర్వేషన్లు, అదానీ వ్యవహారాలపై ప్రశ్నించినప్పుడల్లా రాహుల్‌గాంధీపై కేసులు పెడుతున్నారని ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలను మహిళా కాంగ్రెస్ సహించదని స్పష్టం చేశారు. ఈరోజు రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ అంటే.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై ఎఫ్ఐఆర్ అని ఆమె వ్యాఖ్యానించారు. తాము భయపడేది లేదని, "డరో మత్" అనే స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కులు, మహిళల ఆత్మగౌరవం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు, హల్ద్వానీ ఘటనకు బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తరఫున డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకుర్తిలో పేదలకు ఉచిత కిడ్నీ వైద్య పరీక్షలు

- ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం.. మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తాం: సర్పంచ్ విజయ నాగన్న గౌడ్



జనగామ జిల్లా /పాలకుర్తి, సెప్టెంబర్ 01 (నిత్యం నిఘా ప్రతినిధి): పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధులపై ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజలి కిడ్నీ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పేద, సామాన్య ప్రజలకు కిడ్నీ సంబంధిత వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించారు.కిడ్నీ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఖరీదైన వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఉచితంగా పరీక్షలు అందించడం ద్వారా ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ విజయ నాగన్న గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో వైద్య సేవలు అందించడమే నిజమైన ప్రజాసేవ అన్నారు. పేద కుటుంబాలు ఆరోగ్య సమస్యల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్నదే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు మామిండ్ల కవిత, శోభన్‌బాబు, కమ్మగాని సుధాకర్ గౌడ్, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, గ్రామ కార్యదర్శి ఆర్. శ్రీనివాసరెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.కార్యక్రమానికి సహకరించిన అంజలి కిడ్నీ కేర్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులు, సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.